పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు

గడపగడపకు మన ప్రభుత్వంలో
రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు(రాజంపేట) : రాష్ట్రంలో మూడేళ్లలో 30 ఏళ్ల అభివృద్ధి చేసి చూపించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం కుంపిణీపురం, నూకినేనిపల్లె, కుందానెల్లూరు గ్రామాల్లో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడప మన ప్రభుత్వంలో ఎదురైనా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం యజ్ఞంలా కొనసాగుతోందన్నారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలు అందించడంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించనన్నారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్, ఆసరా, రైతుభరోసా పథకాలు ప్రజలు ఆకర్షితులయ్యారన్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అక్కడక్కడే నిధులు మంజూరు చేయడంలో ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు.

ఇంటింటికి వెళ్లి.. ఆప్యాయంగా పలకరించి

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పొత్తపి సచివాలయం పరిధిలో మూడు గ్రామాల్లో గడప గడప కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి, పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందుగా గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. తదనంతరం సచివాలయాన్ని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, ఎంపీటీసీ మోదుగలచంద్రశేఖర్, ఎంపీడీ సౌభాగ్య, సర్పంచి చప్పిడి విజయకుమార్, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టర్ లక్ష్మినరసయ్య, వక్ఫ్ బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుందానెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, సంభావి శ్రీనువాసులు, కడప రమణయ్య, మేడా వెంకటరత్నం, సంభావి చంద్ర సింగమల జయరాం, మండల ఉపాధ్యక్షుడు తుమ్మల భావన శ్రీధర్, ఆర్ముగం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంపిణీపురం ఆంజనేయస్వామి ఉత్సవాలు

రాజంపేట : కుంపిణీపురం ఆంజనేయస్వామి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో రెండవరోజు భీష్మాష్టమి సందర్భంగా స్వామి సాయంత్రం మోహిని వాహనం, రాత్రి గజ వాహన సేవలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో కుంపిణీపురంలో సందడి అంబరాన్నంటాయి.

ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే రూ.50వేలు అందజేశారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, ఎంపీటీసీ మోదుగల చంద్రశేఖర్, ముదిరాజ్ కార్పోరేషన్ డైరక్టరు లక్ష్మినరసయ్య, వక్ఫ్ బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సంభావి శ్రీనువాసులు, కడప రమణయ్య, మేడా వెంకటరత్నం, సంభావి చంద్ర, ఆర్ముగం విశ్వనాథ్, తుమ్మల శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వాహకులు సాంబావు చంద్ర, కడప శ్రీహరి, మేడా రాజా, సాంబావు లక్ష్మయ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. బండలాగుపోటీలలో మొదటిబహుమతి రూ.50వేలు కల్లూరుకు చెందిన పెరుమాల్ శివకృష్ణయాదవ్, రెండవ బహుమతి రూ.40వేలును చల్లగంగయ్య యాదవ్, పాటిమీదపల్లె, కడప, మూడవ బహుమతి రూ.30వేలును నాగసుబ్బారెడ్డి, ఖాదర్, కడప, నాలుగవ బహుమతి రూ.20వేలును పుత్తనాగసుబ్బారెడ్డి, ఐదవ బహుమతి రూ.10వేలును సంగటి శ్రుతిప్రియ, ఎర్రగుంట్ల, కడపవారు దక్కించుకున్నారు. అలాగే మదన్‌మోహన్‌రెడ్డి సి.సంగతుల, రామన్న, పీఆర్‌పల్లి, నంద్యాల జిల్లా రూ.6వేలును దక్కించుకున్నారు.

హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి



వాహనదారులకు సూచనలు చేస్తున్న సీఐ

ఓబులవారిపల్లె : వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టును తప్పనిసరిగా వాడాలని రైల్వేకోడూరు సీఐ విశ్వనాథరెడ్డి వాహనదారులకు సూచించారు. ఆదివారం సీఐ విశ్వనాథరెడ్డి కొర్లకుంట సమీపంలో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికారాదని, నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపి మరొకరి ప్రాణాలు బలిచేయరాదని సూచించారు. ప్రతి వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సును తమ వెంట ఉంచుకోవాలని, లేనివారు వెంటనే లైసెన్సుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వలీ, కానిస్టేబుల్ నాగరాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం

గాలివీడు : మండల కేంద్రం గేటు దగ్గర ఉన్న రామాలయానికి కరిమిరెడ్డి నిరంజన్‌రెడ్డి రూ.25 వేలును విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. నిర్మాణ దశలో ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్డన్ సెర్చ్



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఒంటిమిట్ట : కొత్త మాధవరం గ్రామంలో ఆదివారం ఒంటిమిట్ట పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు, సిద్దవటం ఎస్ఐ తులసి నాగప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలోని అనుమానిత వ్యక్తుల గృహాలలో, ఖాళీ ప్రదేశాలలో క్షుణ్ణంగా తనిఖీలను చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీరభద్రుడి సన్నిధిలో రాజంపేట జడ్జి



జడ్జి దంపతులకు స్వామి వారి చిత్రపటాలను అందజేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని రాజంపేట 3వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఆయన్ను ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలతోపాటు దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు.

బారికేడ్ల ఏర్పాటు

ఒంటిమిట్ట : మండలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఈ బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని జాతీయ రహదారి వద్ద కొత్త మాధవరం చెక్ పోస్టు వద్ద నుంచి మంటపంపల్లి గ్రామ శివారు వరకు ఎస్ఐ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కొత్త మాధవరం చెక్ పోస్ట్ వద్ద నుంచి మంటపంపల్లి గ్రామ శివారు వరకు దాదాపు 60 బారికేడ్లను పొందుపరిచామన్నారు. వాహనాలు నడిపే సమయంలో వాహదారులు వారినే నమ్ముకుని ఉన్న కుటుంబ సభ్యులను గుర్తుకు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : కసిరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన వైద్య శిబిరాని స్పందన లభించింది. ఆదివారం గ్రామంలో చేపట్టిన వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వైద్యశిబిరంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నిర్వాహకులు, హోలిస్టిక్ హాస్పిటల్ వైద్యులు డా.నవీన్‌అహమ్మద్, డా.షామిలీరెడ్డి, డా.నవీన్‌లను మోహన్‌రెడ్డి అభినందించారు. గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రామమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణ, సర్పంచ్ రఘు, ఉపసర్పంచ్ శివ, సుబ్బయ్య, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో మనస్వి, దినేష్‌రాజుల పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు రామమోహన్‌రాజు, కవితల ఆర్థిక సౌజన్యంతో బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు నాగిరెడ్డి, గంగిరెడ్డి, సుభాష్ చంద్రబోస్, ప్రేమాలయం ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

కంది పంటకు నిప్పు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు సమీపంలోని నిమ్మకాయల ఒడ్డు వద్ద సుధాకర్ అనే రైతు పండించిన కంది పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పొలంలో కోసి ఆరబెట్టిన కంది పంటతో పాటు పొలంలో అమర్చిన పీవీసీ పైపులు కూడా కాలి బూడిద అయ్యాయి.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ



భక్తులకు దర్శనమిస్తున్న మల్లారమ్మ



పూజలందుకుంటున్న గంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దీంతో ఆలయమంతా గంగమ్మ నామస్మరణతో మారుమోగింది. మొక్కుబడులు తీరిన భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు.

మల్లారమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది వద్ద కొలువైన మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

గంగమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురంలో వెలసిన కుర్నూతల గంగమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, ఆలయ ఈఓ రవీందర్ రాజులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఫిబ్రవరి 20, 21, 22వ తేదీల్లో గంగమ్మ జాతర సందర్భంగా ముందస్తు ఏర్పాట్లలో ఆలయ సిబ్బంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'మానవత' సేవలు విస్తృతం చేయాలి

రాయచోటి టౌన్ : మానవత స్వచ్ఛంద సేవ సంస్థ సేవలను మరింత విస్తృతం చేయాలి రాయచోటి వృక్ష రక్షణ వ్యవస్థాపకులు తులసి ఈశ్వర్‌రెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డిలు అన్నారు. నెలవారి కార్యక్రమంలో భాగంగా ప్రతిభ జూనియర్ కళాశాలలో మానవత సంస్థ అధ్యక్షులు కనపర్తి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానత స్వచ్ఛంద సేవా సంస్థ సేవల నిర్వహణకు తన వంతుగా రూ.2లక్షలు విరాళంగా అందజచేశారు. అనంతరం అలాగే మానవతా సేవ సంస్థ కేంద్ర కమిటీ సభ్యులు కె. సహదేవరెడ్డి భార్య కళావతి రూ.50వేలు విరాళంగా అందజేశారు. అనంతరం రాయచోటి ప్రాంతం నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా ఎన్నికైన మనోజ్‌కుమార్‌రెడ్డిని ప్రతిభ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రామానాయుడు, చైర్మన్ శివగంగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్ బ్రహ్మనందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చిన్న నరసింహారెడ్డి, నాగిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, గంగాధర్, రవి, మహబూబ్ బాషా, షకీల్, రెడ్డి పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిట్వేలి: సమావేశంలో పాల్గొన్న మానవత సంస్థ సభ్యులు



రాయచోటి టౌన్: డిప్యూటీ కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సంస్థ సభ్యులు

సంస్థ బలోపేతానికి కృషి చేయాలి

చిట్వేలి : మానవత బలోపేతానికి దాతల సహాయం కోసం సభ్యులు కృషి చేయాలని మానవత చిట్వేలి శాఖ అడ్వైజర్ బోర్డు మెంబర్ సభ్యులు రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ నెలవారీ సమావేశాన్ని అధ్యక్షులు కుంభగిరి మునిరావు అధ్యక్షతన స్థానిక శ్రీ సాయి వికాస్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో మండల ప్రథమ స్థానంలో సాధించిన విద్యార్థికి సంస్థ తరఫున ఆర్థిక సాయం, శాంతిరథం ఏర్పాటు, సంస్థ బలోపేతానికి అంశాలను చర్చించారు. కార్యక్రమంలో సభ్యులు తిరుమల విశ్వనాథం, వీరాంజనేయరాజు, నరసరామయ్య, కార్యదర్శి సాయిరాం, వెంకట్‌రెడ్డి శ్రీనివాసుల రెడ్డి, మధు, సుబ్బరామరాజు, మోహన్, మణి, సభ్యులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వెంకట శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

గాలివీడు : ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ముందుచూపుతో ప్రాజెక్టులు పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందించడం వైఎస్సార్ గొప్పతనమే అని రెడ్ల సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటశివారెడ్డి అన్నారు. వెలిగల్లు వైఎస్సార్ ప్రాజెక్ట్ నుంచి ఇడుపులపాయ వరకు సాగే పాదయాత్రను ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. గాలివీడు, నూలివీడు, తలముడిపి, చక్రాయపేట, గండి మీదుగా ఈ పాదయాత్ర కొనసాగుతుంది. ఈ పాదయాత్రలో వెంకటశివారెడ్డికి పూలమాలతో గ్రామగ్రామాన ఘనస్వాగతం పలికారు.

పోటాపోటీగా విద్య, వైజ్ఞానిక పోటీలు

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వే ఇన్స్టిట్యూట్‌లో స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పోటాపోటీగా విద్య, వైజ్ఞానిక రంగాల పోటీలను నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు వేపగుంట సాంరాజ్ మాట్లాడుతూ పార్లమెంటరీ స్థాయిలో వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జితేంద్ర, రౌఫ్‌బాషా, రాధిక తదితరులు వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జస్వంత్, సాయి, దినేష్, రవికుమార్, రెడ్డి శేఖర్‌బాబు పాల్గొన్నారు. పోటీలలో రాజంపేట, పెనగలూరు, నందలూరులోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్య వైజ్ఞానిక రంగ పోటీలను తిలకిస్తున్న న్యాయనిర్ణేతలు

సమ్మేళనంలో గురువులకు సత్కారం



గురువులతో పూర్వవిద్యార్థులు

నందలూరు(రాజంపేట) : తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించుకున్నారు. 1985–1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్(ఐఏఎస్ పాఠశాల)లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. సన్మానం అందుకున్న వారిలో గురువులు కృష్ణయ్య, జయరామరాజు, హనుమంతరెడ్డి, సుబ్బరాయుడు, రామసుబ్బన్న, చంద్రశేఖర్‌రెడ్డి, చెంచునాగయ్య, శ్రీనివాసులు, ఏవీ వెంకటసుబ్బయ్యల ఉన్నారు. అలాగే ఆనాటి క్లారికల్ స్టాఫ్‌గా ముంతా నరసయ్య, జంబు రవీంద్రబాబులను సన్మానించారు. అనంతరం దివంగత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. వారికి పూర్వవిద్యార్థుల తరుపున నివాళులర్పించారు. ఆత్మీయ సమ్మేళన నిర్వాహకులు నడివీధి సుధాకర్, నరేంద్ర, షఫీ, ప్రసాద్, నాగయ్యలు ప్రశంసించారు.

పొలంబడితో విప్లవాత్మక మార్పులు

గుర్రంకొండ: పొలంబడి కార్యక్రమంతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రత్నమ్మ తెలిపారు. ఆదివారం మండలంలోని సరిమడుగు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో వరి పంట సాగుపై రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ ఒకటిన్నర ఎకరం పొలంలో రైతు ఒక ఎకరం పంట సాగు చేస్తే మిగిలిన అర ఏకరంలో వ్యవసాయాధికారులే పంటను ప్రయోగాత్మకంగా సాగు చేస్తారన్నారు. నూతన సాగు విధానం, రైతుల సాగు విధానానికి వ్యత్యాసం చూపించి అవగాహన కల్పిస్తామన్నారు.

కాపు సంక్షేమ సేన అధ్యక్షుడిగా మురళీకృష్ణ



రాజంపేట రూరల్ : రాష్ట్ర కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు హరిరామ జోగయ్య కాపు సంక్షేమ సేన రాజంపేట నియోజక వర్గ అధ్యక్షుడిగా తనను నియమించినట్లు గుగ్గిళ్ల మురళీకృష్ణ తెలియజేశారు. తన నియమానికి సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యశేఖర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనాథ్‌లతో పాటు ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ యర్రంశెట్టి మస్తాన్‌రాయల్, పార్లమెంటరీ అధ్యక్షురాలు రెడ్డిరాణి, అనంతరాయులు, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌లకు ఈ సందర్భంగా మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని బలిజల ఐక్యమత్యానికి కృషి చేస్తానని చెప్పారు.

రాజారావుకు మొల్లసాహితీ సేవా పురస్కారం ప్రదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శతావధాని నరాల రామారెడ్డి సాహితీ కార్యాలయంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన పద్యకవి, చందస్సు నవ్యసాచి విద్వాన్ చక్రాల లక్ష్మీకాంత రాజారావుకు మొల్లసాహితీసేవా పురస్కారం ప్రదానం చేశారు. మొల్ల సాహితీ పురస్కారం, నగదు పారితోషికం, శాలువవ, జ్ఞాపికను ఆయనకు అందజేశారు. లక్ష్మీకాంత రాజారావు చేసిన సాహితీ సేవకు గాను ఈ పురస్కారాన్ని అందించినట్లు పీఠం వ్యవస్థాపకుడు గానుగాపెంట హనుమంతరావు పేర్కొన్నారు.

శిల్పారామంలో సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. కళాకారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి అర్బన్ : స్వచ్ఛంద సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ కోరారు. స్థానిక నేతాజీ సర్కిల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన రవి న్యూరో అండ్ ఎమర్జన్సీ హాస్పిటల్ వైద్యుల నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రవిశేఖరరెడ్డి, సురేందర్, పూర్ణచంద్రరావు, నిర్మల్, ప్రవీణ్‌నాయక్‌ల వైద్య బృందం సుమారు 200 మందికి ఎముకలు, కీళ్ళు, నరాలు, దంత సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులను అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యుడు మహమ్మద్, వైద్యులు, సిబ్బందితోపాటు పీఆర్‌టీయూ రాష్ట్రనేత శ్రీనివాసరాజు, లయన్స్ క్లబ్ సభ్యులు వినోద్‌నాయక్, ఫక్రుద్దీన్, నూర్జహాన్, అశోక్, రోహిణి తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలందిస్తున్న దృశ్యం

నేడు ఎక్సైజ్ వాహనాల వేలం

గుర్రంకొండ: గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఎక్సైజ్ వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు రాయచోటి డీఎస్పీ శ్రీధర్, కలకడ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో ఎనిమిది వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఐదు ద్విచక్రవాహనాలు, మూడు ఎల్ఎంవీ వాహనాలు ఉన్నాయన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

భద్రతేది.. బాసూ?



పోలిచెరువుకట్టపై ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

పోలి చెరువుకట్ట రోడ్డుపై భద్రత ప్రమాణాలు అటక్కెక్కాయి. ఒక వైపు మాత్రమే భద్రతా ప్రమాణాలు చేపట్టిన అధికారులు, చెరువు ఉన్న ప్రాంతం వైపు ఎటువంటి భద్రతను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు నెలవుగా అగుపిస్తోంది. 30 గ్రామాల ప్రజలతోపాటు విజయవాడ, నెల్లూరుకు ఈ మార్గం గుండానే ప్రయాణించాలి. ఎటువంటి ప్రమాదం జరుగక మునుపే రోడ్డు, రవాణా శాఖ అధికారులు చెరువుకట్టను పరిశీలించి,భద్రతా చర్యలను ఏర్పాటు చేయాలని వాహనచోధకులు, స్థానికులు కోరుతున్నారు.

– రాజంపేట టౌన్

మహా బాగు.. వేరుశనగ సాగు



మట్లి వద్ద కళకళలాడుతున్న వేరుశనగ పంట

మండలంలోని పలు గ్రామాలలో సాగుచేసిన వేరుశనగ పంట ఆశాజనకంగా ఉందని మండలంలోని రైతులు అంటున్నారు. ఈ ఏడాది అక్కడక్కడ కురిసిన వర్షాలకు కుంటలు, చెరువులలో నీరు ఉండటం వలన వాటి కింద సాగుచేసిన వేరుశనగ పంట కళకళలాడుతోందని, దీంతో ఈ ఏడాది మంచి లాభాలు పొందుతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 500 ఎకరాలకుపైగా వేరుశనగ పంటను సాగుచేసినట్లు వ్యవసాయ గణాంకాలు తెలుపుతున్నాయి.

– వీరబల్లి